# ఉత్తరప్రదేశ్ అల్పసంఖ్యాక క్రిస్టియన్లపై పెరుగుతోన్న దాడులు

**2018** సం॥లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అల్పసంఖ్యాకులైన క్రిస్టియనులను లక్ష్యంగా చేసుకొని వారిపై హింస, దాడుల ఘటనలు పెరిగాయని రెలిజియస్ లిబర్టి కమిషన్ (ఆర్ఎల్సి) నమోదుచేసి, సంకలనం చేసిన నివేదిక వెల్లడిచేస్తోంది. ప్రత్యేకించి 2018 సెప్టెంబర్, అక్టోబర్ నెలల కాలంలో క్రిస్టియన్ మైనారిటీలపై హింస, దాడులకు సంబంధించిన ఘటనలు అత్యధికంగా చోటుచేసుకున్నాయి. సెప్టెంబర్ నెలలో 28 ఘటనలు జరుగగా, అక్టోబర్లో 16 ఘటనలు నమోదయ్యాయి.

క్రిస్టియన్ మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని విద్వేషంతో కూడిన దాడులు, హింసలకు సంబంధించిన ఘటనలు 2017 సం॥రంలో ఆర్ఎల్సి నమోదుచేసిన ప్రకారం 50 వరకు జరిగాయి. దీనిని 2012–'17 కాలంలో అత్యధికంగా క్రిస్టియన్లపై దాడులు జరిగిన సం॥రంగా భావిస్తే, 2018 సం॥లో అక్టోబర్ నాటికే నమోదైన దాడుల సంఖ్య 64గా వుంది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం తూర్పుభాగంలోని జౌన్పూర్జిల్లా, క్రిస్టియన్లకు వ్యతిరేకంగా వ్యవస్థీకృతంగా సాగుతున్న విద్వేష ప్రచారం, హింస, దాడులకు కేంద్రబిందువుగా వుంది. నరేంద్రమోడి ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గానికి జౌన్పూర్ సుమారు 50 కి.మీ.ల దూరంలో వుంది. జౌన్పూర్లో మొదలైన ఈ ఘటనలు క్రమంగా అజాంఘర్, ప్రతాప్ఘర్, సిద్ధార్ధనగర్, బారాబంకి, ఘాజిపూర్, గోరఖ్పూర్, ఆగ్రా, కాన్పూర్ మరియు వారణాసి వరకు విస్తరించాయి.

"బలవంతపెట్టి లేదా ప్రలోభాలతో" మత మార్పిడులు జరుగుతున్నాయనే సౌలభ్యమైన ఆరోపణను ఉపయోగించి హిందూమతతత్వ సంస్థలు చర్చిలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నాయి. ఈ దాడులకు ముందుండి నేతృత్వం వహించే రాజకీయశక్తులతో చేతులు కలిపిన భాగస్వామిలాగా ప్రసారమాధ్యమాలు వ్యవహరిస్తున్నాయి.

పోలీసులు మరియు హిందూమతతత్వ సంస్థల గుంపులు క్రిస్టియన్ల ప్రార్ధనా కార్యక్రమాలను అడ్డుకుంటూ, ఆ మతాన్ని విశ్వసించేవారిని వేధింపులకు గురిచేస్తున్నారు. క్రిస్టియన్ ప్రార్ధనా కేంద్రాలకు వెళుతున్న వారి మార్గాలను నిరోధించి, ప్రార్ధనా స్థలాలకు వారిని వెళ్ళనీయకుండా, వారిని తిప్పి పంపిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కన్పిస్తున్నాయి. మితవాద గుంపులు పాస్టర్లపై దాడులకు పాల్పడటమేగాకుండా, చర్చి సమావేశాలకు, ప్రార్ధనలకు హాజరైన వారిపట్ల అసభ్యంగా వ్యవహరించటం, మూకదాడులకు పాల్పడటం జరుగుతోంది. చర్చిలను, ఆయా యాజమాన్యాల వాహనాలను ధ్వంసంచేయటం మొదలైన ఎంతో ప్రచారం స్థానిక ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలలో, సామాజిక మాధ్యమాలలో జరుగుతోంది.

దర్యాప్తు చేయాలనే సాకుతో ఎంతోమంది పాస్టర్లను, క్రిస్టియన్లను నిర్బంధించటమో, అరెస్టు చేయటమో జరిగింది. నిర్బంధంలోకి తీసుకునే ఈ ఘటనలన్నీ రాత్రిపూట, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జరగటం వారిపై సాగుతోన్న వేధింపుల తీవ్రతను తెలుపుతోంది.

2018 సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలో క్రిస్టియన్లపై సాగిన హింస, దాడుల సంఘటనలను పైన పేర్కొన్న నివేదిక క్రోడీకరించింది. ఈ రెండు నెలలలో జరిగిన మొత్తం ఘటనలు 71 కాగా, దీనిలో ఉత్తరప్రదేశ్లోనే 44 ఘటనలు జరిగాయి. ఇక జార్ఖండ్లో 4, తమిళనాడు 4, బీహార్, తెలంగాణాలలో 3 ఘటనల చొప్పున; రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఛత్తీస్ఘడ్, పశ్చిమ బెంగాల్లలో రెండు ఘటనల చొప్పున; జమ్ముకాశ్మీర్, అస్సామ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఒక ఘటన చొప్పున ఈ కాలంలో జరిగాయి. 2018 జనవరి నుండి అక్టోబర్ మధ్యకాలంలో మొత్తంగా అల్పసంఖ్యాక మతస్థులైన క్రిస్టియనులపై 195 ఘటనలు జరిగినట్లుగా ఈ నివేదిక పేర్కొంది.

**(ఎవలాంజికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా రెలిజియస్ లిబర్టి కమిషన్ (ఇఎఫ్ఐ ఆర్ఎల్సి) ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అల్పసంఖ్యాక క్రిస్టియన్ మతస్థులపై జరిగిన దాడుల వివరాలతో రూపొందించిన నివేదికలోని కొన్ని భాగాలను ప్రచురిస్తున్నాం. – సంపాదకుడు)**

ooooo